www.prajasakti.com
ప్రజాశక్తి
శనివారం 1 నవంబర్ 2025
5
పశ్చిమ గోదావరి



వచ్చేనెల 13న జాతీయ లోక్ అదాలత్

తణుకు : డిసెంబరు 13వ తేదీ శనివారం జరిగే జాతీయ లోక్ అదాలత్‌లో అన్ని రకాల రాజీపడు క్రిమినల్ కేసులు, సివిల్ కేసులు, చెక్ బౌన్స్ కేసులు, మోటారు వాహనాల ఆక్సిడెంట్ కేసులు రాజీ చేసుకోవచ్చునని ఛైర్మెన్, నాల్గవ అదనపు జిల్లా జడ్జి డి.సత్యవతి తెలియజేశారు. శుక్రవారం స్థానిక కోర్టు హాలులో తణుకు కోర్టు పరిధిలో పనిచేయు పోలీసు అధికారులతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా జడ్జి సత్యవతి మాట్లాడుతూ ప్రతి రోజు జరుగు లోక్ అదాలత్ ప్రీ సిట్టింగ్స్ ద్వారా, మీడియేషన్ ద్వారా, కౌన్సిలింగ్ ఇచ్చి కేసులు రాజీ చేసుకోవచ్చునని తెలిపారు. చిన్న చిన్న విషయాలలో ఏళ్ల తరబడి పోలీసు స్టేషన్‌ల చుట్టూ, కోర్టుల చుట్టూ తిరిగి విలువైన సమయాన్ని, డబ్బును వృధా చేసుకోకూడదని, విలువైన సమయాన్ని, డబ్బును ఆదా చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో న్యాయమూర్తులు పివిఎన్.రంజిత్‌కుమార్, కె.కృష్ణవేణి, పి.హనుమంతరావు, ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ మణికంఠరెడ్డి, అన్ని పోలీస్ స్టేషన్ల పోలీసు అధికారులు పాల్గొన్నారు.

సిపిఎం నేత చింతకాయల బాబూరావుకు కన్నీటి వీడ్కోలు

- కంటతడి పెట్టిన కార్మికవర్గం, మహిళాలోకం
- అంతిమయాత్రకు తరలొచ్చిన వందలాది మంది
- తుది శ్వాస విడిచే వరకు పోరాటాలే బాబూరావు ఊపిరి
- బాబూరావు స్ఫూర్తితో జిల్లాలో బలమైన కమ్యూనిస్టు ఉద్యమం నిర్మించాలి
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు
- పది రోజుల్లో సంస్మరణ సభ
- సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్





బాబూరావు భౌతికకాయం వద్ద నివాళులర్పించి, సంతాప సభలో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

ప్రజాశక్తి - భీమవరం/తాడేపల్లిగూడెం

సిపిఎం సీనియర్ నేత చింతకాయల బాబూరావు అంతిమయాత్ర శుక్రవారం తాడేపల్లిగూడెంలో అశ్రునయనాల నడుమ సాగింది. ఉమ్మడి జిల్లాతోపాటు వివిధ ప్రాంతాల నుంచి కార్మికులు, మహిళలు, రైతులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, సిపిఎం శ్రేణులు, నాయకులు, వామపక్షాల, వివిధ రాజకీయ పార్టీల నేతలు పెద్దసంఖ్యలో తరలొచ్చారు. బాబూరావుతో ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకుని ఘనంగా నివాళులు అర్పించారు. గుండె సంబంధిత చికిత్స నిమిత్తం గురువారం రాజమండ్రి ఆసుపత్రికి వెళ్లిన చింతకాయల బాబూరావు గుండెపోటుతో అక్కడే మృతి చెందిన సంగతి తెలిసిందే. రాజమండ్రి నుంచి తాడేపల్లిగూడెం సిపిఎం కార్యాలయానికి భౌతికకాయాన్ని తీసుకొచ్చి ప్రజల సందర్శనార్థం ఉంచారు. అనంతరం గురువారం రాత్రి తాడేపల్లిగూడెంలోని స్వగృహానికి తరలించారు. శుక్రవారం ఉదయం బాబూరావు భౌతికకాయాన్ని సందర్శించేందుకు వందలాది మంది తరలొచ్చి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు, రైతుసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి, ఎపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై.వెంకటేశ్వరరావు, సిఐటియు జాతీయ ఉపాధ్యక్షురాలు జి.బేబిరాణి, సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.బలరాం, రాష్ట్ర నేతలు మంతెన సీతారాం, జయరాం, జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్, బాబూరావు భార్య శ్రీదేవి, కుమారుడు సిద్ధార్థ, ఐఎఫ్‌టియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.పోలారి, రాష్ట్ర సహాయ కార్యదర్శి యు.వెంకటేశ్వరరావు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాజారామ్మోహన్‌రాయ్, కాకినాడ జిల్లా అధ్యక్షులు శేషుబాబ్జి, న్యూ డెమోక్రసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.ప్రసాద్, జిల్లా కార్యదర్శి సుధాకర్, అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఝాన్సీ, డి.కళ్యాణి, వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన నేతలు, తాడేపల్లిగూడెం పట్టణ ప్రముఖులు బాబూరావు భౌతికకాయానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. శుక్రవారం ఉదయం ఆయన స్వగృహం నుంచి ప్రారంభమైన అంతిమయాత్ర డిఎస్‌చెరువు, శేషమహల్ థియేటర్, మెయిన్ రోడ్డు మీదుగా ఏలూరు రోడ్డులో కొత్త ఫ్లయ్ ఓవర్ వరకూ సాగింది. కార్యక్రమంలో ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి సిహెచ్.లక్ష్మి, నాయకులు జ్యోతి, జయంతి, సిఐటియు నాయకులు బి.వాసుదేవరావు, పి.వి.ప్రతాప్, ఎస్.రంగారావు, జవ్వాది శ్రీను, సిపిఎం సీనియర్ నాయకులు జుత్తిగ నరసింహమూర్తి, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు గణేష్, టి.ప్రసాద్, యుటిఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు సిహెచ్.పట్టాభిరామయ్య, రైతుసంఘం జిల్లా కార్యదర్శి ఆకుల హరేరాం, జన విజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లుల శ్రీనివాస్, జిల్లా నాయకులు చింతపల్లి ప్రసాదరావు, కౌలురైతు సంఘం జిల్లా కార్యదర్శి మామిడిశెట్టి రామాంజనేయులు, ప్రజానాట్య మండలి జిల్లా నాయకులు షేక్ వలీ, సిఐటియు ఏలూరు జిల్లా ప్రధాన కార్యదర్శి డిఎన్‌విడి.ప్రసాద్, సిపిఎం ఏలూరు జిల్లా నేతలు తెల్లం రామకృష్ణ, గుడిపాటి నర్సింహరావు తదితరులు పాల్గొన్నారు.

తుదిశ్వాస విడిచే వరకూ పోరాటాలే బాబూరావు ఊపిరి

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

సాధారణ కార్మికునిగా జీవితాన్ని ప్రారంభించిన బాబూరావు తన తుదిశ్వాస విడిచే వరకూ పోరాటాలే ఊపిరిగా పని చేశారని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. తాడేపల్లిగూడెంలో ఆయన స్వగృహం వద్ద బాబూరావు భౌతికకాయానికి శుక్రవారం పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. బాబూరావు భార్య శ్రీదేవి, కుమారుడు సిద్ధార్థకు ధైర్యం చెప్పి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కర్రి నాగేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించిన సభలో శ్రీనివాసరావు మాట్లాడారు. సాధారణ కార్మికునిగా బాబూరావు జీవితాన్ని ప్రారంభించారని, అంచెలంచెలుగా ఎదిగి జిల్లాలో ముఖ్యనేతగా, రాష్ట్రస్థాయిలో కార్మిక నేతగా వ్యవహరించిన తీరు అందరికీ స్ఫూర్తినిస్తుందన్నారు. చివరి శ్వాస వరకు ఉద్యమాలకు అంకితమై పని చేస్తున్నారన్నారు. భార్య శ్రీదేవి, కుటుంబం కూడా ఉపాధ్యాయ, ప్రజా ఉద్యమాల్లో వెన్నంటే ఉన్నారన్నారు. వారికి పార్టీ రాష్ట్ర కమిటీ తరపున సానుభూతి తెలియజేస్తున్నామన్నారు. కుటుంబానికి బాబూరావు లేని లోటు తీర్చలేనిదని, అయితే కష్ట సమయంలో పార్టీ అండగా ఉంటుందన్నారు. కార్మికులు, రైతులు, ప్రజాసంఘాల కార్యకర్తలు బాబూరావు ఆశయ సాధనకు కృషి చేసి, ఆయన స్ఫూర్తితో జిల్లాలో, తాడేపల్లిగూడెంలో బలమైన కమ్యూనిస్టు ఉద్యమాన్ని నిర్మించాలని పిలుపునిచ్చారు.

బాబూరావు మృతి వామపక్ష ఉద్యమానికి తీరనిలోటు

ఏలూరు అర్బన్: కార్మికోద్యమ నేత చింతకాయల బాబూరావు ఆకస్మిక మృతి జిల్లాలో కార్మికోద్యమానికి, సిపిఎంకు, వామపక్ష ఉద్యమాలకు తీరని లోటు అని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం మధ్యాహ్నం బాబూరావు భౌతికకాయాన్ని ఏలూరు ఆశ్రం మెడికల్ కాలేజీకి కుటుంబ సభ్యుల సమక్షంలో అందజేశారు. తాడేపల్లిగూడెం నుంచి బాబూరావు భౌతికకాయాన్ని ఏలూరు ఆశ్రం వైద్య కళాశాల వద్దకు అంబులెన్స్‌లో తీసుకొచ్చారు. ఆశ్రం వైద్య కళాశాల గేటు వద్ద సిపిఎం, సిపిఐ, వామపక్ష అభిమానులు, సానుభూతిపరులు, వివిధ సంఘాల నేతలు బాబూరావుకు నివాళులు అర్పించారు. అనంతరం అక్కడి నుంచి వైద్య కళాశాల లోపలి వరకూ ర్యాలీగా నినాదాలు చేస్తూ అనాటమీ డిపార్ట్‌మెంట్‌కు చేరుకున్నారు. అక్కడ నేతల సమక్షంలో భార్య శ్రీదేవి, కుమారుడు సిద్ధార్థ బాబూరావు భౌతికకాయాన్ని కళాశాల అనాటమీ డిపార్ట్‌మెంట్ వారికి అప్పగించారు. ఈ సందర్భంగా ఎ.రవి అధ్యక్షతన జరిగిన సభలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎం.కృష్ణచైతన్య మాట్లాడుతూ బాబూరావు సిపిఎం నేతగా, కార్మిక నేతగా ఉద్యమాల్లో కీలకపాత్ర పోషించారన్నారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో రైస్‌మిల్ యూనియన్లో కీలక పాత్ర పోషించారన్నారు. బాబూరావు మరణం సిపిఎంకు, వామపక్ష నేతలకు తీరని లోటన్నారు. మరణానంతరం కూడా సమాజానికి ఉపయోగపడేలా, తన భౌతికకాయాన్ని మెడికల్ కళాశాలకు ఇవ్వడం సిపిఎం క్రమశిక్షణకు నిదర్శనమన్నారు. నిరంతరం ప్రజల పక్షాన మాట్లాడిన నేతగా, కార్మిక నేతగా మంచి గుర్తింపు పొందారని తెలిపారు. బాబూరావు మరణం కార్మిక ఉద్యమాలతో పాటు వామపక్ష ఉద్యమానికి తీరని లోటన్నారు. ఎన్‌జిఒ యూనియన్ పూర్వ జిల్లా అధ్యక్షులు ఎల్.విద్యాసాగర్ మాట్లాడుతూ చిరకాల మిత్రుడిని కోల్పోయామన్నారు. ఈ కార్యక్రమంలో పశ్చిమగోదావరి, ఏలూరు జిల్లాల నాయకులు కర్ర నాగేశ్వరరావు, కేశా గోపాలన్, పి.వి.ప్రతాప్, డిఎన్‌విడి.ప్రసాద్, ఆర్.లింగరాజు, తెల్లం రామకృష్ణ, ఎం.నాగమణి, కె.శ్రీనివాస్, పి.రామకృష్ణ, జి.రాజు, ప్రస్థ నాయకులు ఆర్.వై.రాము, ఏలూరు నగర కార్యదర్శి పంపన రవి, నాయకులు ఎం.ఇస్సాక్, ఐద్వా జిల్లా కార్యదర్శి వి.శ్యామలారాణి, చేతివృత్తిదారుల సంఘం కన్వీనర్ పి.ఆదిశేషు, సిపిఐ నగర నాయకులు హేమశంకర్, మానవత నగర అధ్యక్షులు మేతర అజయ్‌బాబు, సిపిఎం మాజీ కౌన్సిలర్ కంది విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.

ప్రజా ఉద్యమాలకు తీరని లోటు

సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్

బాబూరావు మృతి కుటుంబానికే కాకుండా ప్రజా ఉద్యమానికి తీరనిలోటు అని సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్ అన్నారు. ఆసుపత్రికి అని వెళ్లిన బాబూరావు ఆకస్మికంగా మృతి చెందడం బాధాకరమన్నారు. పది రోజుల్లో ఆయన సంస్మరణ సభ ఉంటుందని తెలిపారు. ఆయన జీవిత ప్రస్థానాన్ని తెలుసుకోవాల్సిన అవసరం అందరికీ ఉందన్నారు. కమ్యూనిస్టులు బతికేది ప్రజల కోసమేనని, మరణానంతరం కూడా ప్రజల కోసమే ఉపయోగపడాలనే ముఖ్యోద్దేశంతో బాబూరావు భౌతికకాయాన్ని ఏలూరు ఆశ్రం వైద్య కళాశాలకు అప్పగించాలని గతంలోనే ఆయన నిర్ణయించుకున్నారని, దానికి కుటుంబం సైతం సమ్మతి తెలిపిందని వివరించారు.



రోదిస్తున్న భార్య, కుమారుడు



అంతిమయాత్రలో మహిళలు, నేతలు



ఏలూరు ఆశ్రం ఆస్పత్రి వద్ద నేతల నివాళి

రైతు కంట కన్నీరు..!

- మొంథా తుపానుతో తీరని నష్టం
- రెండు జిల్లాల్లో 40 వేలకుపైగా ఎకరాల్లో వరిపంటకు దెబ్బ
- నేలనంటి నీటిలో నానుతున్న వరి పైరు
- ఈనిక దశలో ఉన్న పైరు పాలు పోసుకోని పరిస్థితి
- రెండు రోజుల్లో పూర్తిస్థాయి పంట నష్టం లెక్కలు పూర్తి
- దేవాదాయ భూముల కౌలు రైతుల పరిస్థితి అగమ్యగోచరం

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

'ఉంగుటూరుకు చెందిన రైతు మిడియాల ప్రసాద్ ఖరీఫ్‌లో ఆరెకరాలు కౌలుకు తీసుకుని సాగు చేశాడు. పంట చివరి దశలో మొంథా తుపాను రావడంతో పంట నేలవాలింది. దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపే పరిస్థితి ఏర్పడింది. ఇప్పటికే ఎకరాకు రూ.30 వేలు వరకూ పెట్టుబడి పెట్టారు. నేలవాలిన చేలు మాసూలు చేయాలంటే ఎకరాకు అదనంగా మరో రూ.5 వేలకుపైగా ఖర్చుపెడుతుందని లబోదిబోమంటున్నాడు'.

'దెందులూరు మండలం కొవ్వలి గ్రామానికి చెందిన కట్టా కృష్ణ 25 ఎకరాల వరకూ కౌలుకు తీసుకుని ఖరీఫ్‌లో సాగు చేశారు. తుపాన్ దెబ్బకు పంట పూర్తిస్థాయిలో దెబ్బతింది. పొలాలు నేలవాలడంతోపాటు ఈనిక దశలో ఉన్న పొలాలు గింజ పాలుపోసుకోకుండా తాలుగా మారిపోతున్న పరిస్థితి ఉంది. దీంతో దిగుబడిపై తీవ్ర ప్రభావం పడనుందని గగ్గోలు పెడుతున్నాడు'.



ఉంగుటూరు మండలంలో దెబ్బతిన్న వరిపంటను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎంఎల్‌ఎ

పైన పేర్కొన్న రైతులు ప్రసాద్, కృష్ణలే కాదు. రెండు జిల్లాల్లో వేలాది మంది రైతులు చేతికొచ్చిన పంటను కోల్పోయి కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. ప్రభుత్వ సాయం కోసం ఎదురుచూస్తున్నారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో పశ్చిమగోదావరి జిల్లాలో 2.15 లక్షల ఎకరాలు, ఏలూరు జిల్లాలో 1.95 లక్షల ఎకరాల్లో రైతులు వరి సాగు చేశారు. ఈ ఏడాది వాతావరణం అనుకూలంగా ఉండటంతో దిగుబడి బాగుంటుందని రైతులు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. మొంథా తుపాను విరుచుకుపడటంతో రెండు జిల్లాల్లోని రైతులకు తీవ్ర నష్టం మిగిల్చింది. తుపాను ప్రభావంతో వీచిన గాలులు, వర్షాలకు అత్యధిక పంట నేలనంటి నీటిలో నానుతోంది. ఈ పంటను ఏవిధంగా మాసూలు చేయాలో రైతులకు తెలియని అయోమయ పరిస్థితి నెలకొంది. ఖర్చులు అదనంగా చేయాల్సి వస్తుందని రైతులు చెబుతున్నారు. ఎకరాకు పది బస్తాలకుపైగా దిగుబడి నష్టం ఉంటుందని రైతులు హొల్లుమంటున్నారు. ఈనిక దశలో ఉన్న పొలాలు నిలబడి ఉన్నప్పటికీ కంకులపై పూత రాలిపోవడంతో గింజలు తాలుగా మారిపోతున్నాయి. దిగుబడిపై గణనీయమైన ప్రభావం చూపనుండటంతో రైతులకు దిక్కుతోచని పరిస్థితి నెలకొంది. ఇప్పటికే ఎకరాకు రూ.30 వేలకుపైగా రైతులు పెట్టుబడులు పెట్టారు. తుపానుకు దెబ్బతిన్న పొలాలు మాసూలు చేయాలంటే సాధారణంగా వచ్చే దానికంటే ఎకరాకు మరో రూ.పదివేలకుపైగా ఖర్చు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. 33 శాతానికిపైగా దెబ్బతిన్న పొలాలకు మాత్రమే పంట నష్టపరిహారం జాబితాలో చేరుస్తున్నారు. దీంతో రైతులకు తీవ్ర నష్టం కలిగే పరిస్థితి నెలకొంది.

రెండు జిల్లాల్లో 40 వేల ఎకరాల్లో పంట నష్టం

తుపాన్ ప్రభావం తగ్గడంతో ప్రభుత్వ ఆదేశాలతో శుక్రవారం నుంచి పంట నష్టం లెక్కలు (ఎన్యుమరేషన్) అధికారులు ప్రారంభించారు. పశ్చిమగోదావరి జిల్లాలో 26,537 ఎకరాల్లో పంటనష్టం ఉంటుందని లెక్కలుగట్టారు. తొలిరోజు 4,150 ఎకరాలకు సంబంధించిన పంటనష్టం అంచనాలను నమోదు చేశారు. ఏలూరు జిల్లాలో 15,895 ఎకరాల్లో పంట నష్టం ఉంటుందని లెక్కతేల్చగా తొలిరోజు 3,670 ఎకరాలకు సంబంధించి పంటనష్టం నమోదు ప్రక్రియను పూర్తి చేశారు. ఆదివారం నాటికి పంటనష్టం నమోదు లెక్కలు పూర్తికానున్నట్లు అధికారులు చెబుతున్నారు. దెబ్బతిన్న పంటలకు సంబంధించి ఎకరాకు రూ.పది వేలు చొప్పున ప్రభుత్వం నష్టపరిహారం ఇవ్వనుంది. వెంటనే ఇస్తారా.. లేక కాలయాపన చేస్తారా అనే అనుమానాలు నెలకొన్నాయి.

కౌలు కార్డులు లేని కౌలు రైతుల పరిస్థితి ఏమిటి?

జిల్లాలో చాలా మంది కౌలురైతులకు కౌలుకార్డులు ఇవ్వలేదు. పంట దెబ్బతిన్న రైతుల్లో 90 శాతానికిపైగా కౌలురైతులే ఉన్నారు. వెబ్‌ల్యాండ్ ఆధారంగా పంటనష్టం నమోదు ప్రక్రియ సాగిస్తోంది. కౌలుకార్డులు లేని కౌలురైతులకు నష్టం ఏవిధంగా ఇస్తారో ప్రశ్నలకు ఏమాత్రం వద్ద సమాధానం లేకుండాపోయింది. పైసా పెట్టుబడి పెట్టని భూయజమానుల ఖాతాల్లో పంట నష్ట పరిహారం సొమ్ము జమ చేస్తే తమ పరిస్థితి ఏమిటని కౌలురైతులు ప్రశ్నిస్తున్నారు. కౌలు రైతులకు నష్ట పరిహారం అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. దేవాదాయ భూములను కౌలుకు తీసుకున్న రైతులు ముందుగా కౌలు చెల్లించారు. ఆ రైతులను ఏవిధంగా ఆదుకుంటారో ప్రభుత్వం చెప్పాల్సి ఉంది. లేకపోతే వారు సాగుదారులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉంది.

పంటు రాకపోకలు పునరుద్ధరణ

ప్రజాశక్తి - నరసాపురం

నరసాపురం-సఖినేటిపల్లి మధ్య గోదావరిపై నిలిచిన పంటు రాకపోకలను శుక్రవారం నుంచి అధికారులు పునరుద్ధరించారు. ఐదు రోజులుగా తుపాన్ నేపథ్యంలో ముందస్తుగా మండల పరిషత్ అధికారులు గోదావరిపై పంటు రాకపోకలను నిలుపుదల చేసిన సంగతి తెలిసిందే. దీంతో లంక ప్రజలు చించినాడ మీదుగా చుట్టుతిరిగి పట్టణానికి రావాల్సి వచ్చింది. తుపాన్ ప్రభావం తగ్గిపోవడంతో శుక్రవారం నుంచి గోదావరిపై పంటు రాకపోకలను అనుమతించారు.




గోదావరిలో నడుస్తున్న పంటు

చేనేత కుటుంబాలకు అండగా ఉంటాం

నిత్యావసరాల పంపిణీలో మంత్రి నిమ్మల

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

తుపాను సాయంగా 65 చేనేత కుటుంబాలకు 50 కేజీల బియ్యం, నిత్యావసర సరుకులను మంత్రి నిమ్మల రామానాయుడు అందజేశారు. వైసిపి ఐదేళ్ల పాలనలో చేనేత పరిశ్రమ, కార్మికుల అభివృద్ధి, సంక్షేమాన్ని జగన్ పట్టించుకోలేదని, కనీసం తుపాను, భారీ వర్షాల సమయంలోను 100 గ్రాముల బియ్యం, ఒక్క రూపాయి కూడా సాయం అందించలేదని అన్నారు. పాలకొల్లు మండలం దగ్గులూరు గ్రామంలో శుక్రవారం తుపాన్ ప్రభావిత 655 చేనేత కుటుంబాలకు 50 కేజీల బియ్యం, నిత్యావసర సరుకులను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి రామానాయుడు మాట్లాడుతూ నేడు ముఖ్యమంత్రి చంద్రబాబు తుపాన్ తీరం దాటిన మరుసటి రోజు నుంచే పెద్ద ఎత్తున సాయం అందించే కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారని, గతంలో వారం పది రోజులు దాటినా పట్టించుకున్న నాథుడే లేడన్నారు. భారీ వర్షాలకు చేనేత మగ్గం దెబ్బతిని, పనిలేని చేనేత కుటుంబాలను ఆదుకునేలా కూటమి ప్రభుత్వం సాయం అందిస్తుందన్నారు. గత టిడిపి ప్రభుత్వంలోనూ సాయం అందిందని, మళ్లీ కూటమి ప్రభుత్వంలో అందుతుందన్నారు. కూటమి ప్రభుత్వానికి అండగా ఉండే చేనేత కార్మికుల కుటుంబాల్లో కొత్త వెలుగును తీసుకువచ్చేలా, చేనేత వస్త్రాలకు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు తీసుకువచ్చేలా చంద్రబాబు కృషి చేస్తున్నారన్నారు. పవర్ లూమ్‌లకు 500 యూనిట్లు, హ్యాండ్లూమ్‌లకు 200 యూనిట్లు ఉచిత విద్యుత్తు అమలుతో చేనేత పరిశ్రమకు కూటమి ప్రభుత్వం ప్రోత్సాహం ఇస్తోందని, రాష్ట్రంలో 93 వేల మంది చేనేత కుటుంబాలకు లబ్ధి చేకూరనుందన్నారు. 50 ఏళ్లకే చేనేత కార్మికులకు రూ.4 వేల పెన్షన్, చేనేత కార్మికులకు ఉచిత బీమా అందించడంతో పాటు ప్రత్యేకంగా చేనేత క్లస్టర్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఒక్కసారి ఛాన్స్ ఇవ్వండని అధికారంలోకి వచ్చిన జగన్ రాష్ట్రాన్ని 20 ఏళ్లు వెనక్కి తీసుకువెళ్లాడని విమర్శించారు. ఈ కార్యక్రమంలో నరసాపురం ఆర్‌డిఒ దాసిరాజు, పాలకొల్లు తహశీల్దార్ వై.దుర్గా కిషోర్, మాజీ ఎంఎల్‌సి అంగర రామ్మోహన్, ఎఎంసి ఛైర్మన్ కోడి విజయభాస్కర్, కూటమి నాయకులు ఉన్నమట్ల కబర్ధి, పాములు రజినీకుమార్, కలిదిండి రామచంద్ర రాజు, తులా రామలింగేశ్వరరావు, కాపిశెట్టి అయ్యప్పనాయుడు, సాగ సత్యనారాయణ, ఇంటి శ్రీరాముడు, నెక్కింటి ఆదినారాయణ పాల్గొన్నారు.




నిత్యావసరాలను అందజేస్తున్న మంత్రి నిమ్మల

ముంపు ప్రాంతాల్లో కలెక్టర్ సుడిగాలి పర్యటన

ఉప్పుటేరులో పంటుపై ప్రయాణం

పనులను వెంటనే ప్రారంభించాలని అధికారులకు ఆదేశాలు



బాధితులను పరామర్శిస్తున్న కలెక్టర్

ప్రజాశక్తి - భీమవరం టౌన్

జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి భీమవరం రూరల్ ప్రాంతంలోని గూట్లపాడు శివారు, కొత్త పూసల మర్రు, దొంగపిండి, నాగిడి పాలెం, తోక తిప్ప ప్రాంతాలలో అధిక వర్షాలకు ఉప్పుటేరు బ్యాక్ వాటర్ కారణంగా ముంపుకు గురైన ప్రాంతాలను విస్తృత స్థాయిలో కలియ తిరిగి స్థానిక నివాసితుల నుండి సమస్యలను, ముంపుకు గురవ్వడానికి గల కారణాలను, పరిష్కార మార్గాలను అడిగి తెలుసుకున్నారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ పర్యటించిన గ్రామాలలో ప్రధానంగా ఉప్పుటేరు బ్యాక్ వాటర్ కారణంగా కొద్దిపాటి వర్షానికే తమ నివాస ప్రాంతాల చుట్టూ నీరు చేరుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. తాగడానికి మంచి నీళ్లు రావడం లేదని, వచ్చినా అవి కనీసం వాడుకోవడానికి కూడా వీలు కాని విధంగా ఉన్నాయని, తాగునీటికి వాటర్ టిన్‌లు కొని తెచ్చుకుంటున్నామని తెలిపారు. కలెక్టర్ తొలుత గూట్లపాడు శివారు కోతిమొగ డ్రెయిన్ వద్ద వాస్తవ పరిస్థితిని పరిశీలించారు. కోతిమొగ డ్రెయిన్ ఆనుకుని ఆక్రమణ కారణంగా డ్రెయిన్ సాఫీగా నీటిపారుదల లేదని, దీని కారణంగా ఈ ప్రాంతమంతా నీటి ముంపుకు గురవుతుందని స్థానికులు కలెక్టర్‌కు తెలిపారు. కలెక్టర్ వెంటనే స్పందిస్తూ వాస్తవంగా డ్రెయిన్ వెడల్పు ఎంత ఉండాలి, ఎంత మేరకు ఆక్రమణలకు గురైంది సర్వే చేసి, మార్కింగ్ ఇచ్చి అక్రమణలను వెంటనే తొలగించాలని ఇరిగేషన్ అధికారులను, తహశీల్దార్లను ఆదేశించారు. అనంతరం కొత్త పూసల మర్రు కాలనీ సందర్శించి అక్కడ నీటి ముంపుకు గురైన ప్రాంతాన్ని పరిశీలించి స్థానిక ప్రజలతో మాట్లాడారు. చిన్నపాటి వర్షానికే ఈ ప్రాంతమంతా మునిగిపోతుందని, తాగునీటికి ఇబ్బందిగా ఉందని, పాములు వస్తున్నాయని, స్లూయిస్ సమస్య కారణంగా బ్యాక్ వాటర్ వస్తుందని, కరెంటు స్తంభాలు పాడైపోయాయని, తదితర సమస్యలను వారు జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకు వచ్చారు. ఆయా సమస్యలపై కలెక్టర్ స్పందిస్తూ సమస్యల పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అవసరమైతే మరికొన్ని రోజులు పునరావాస కేంద్రాన్ని కొనసాగించాలని ఆర్‌డిఒకు సూచించారు. వైద్య శాఖ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. అనంతరం దొంగపిండి జిల్లా పరిషత్ హై స్కూల్ ప్రాంగణంలో నిలిచిన నీటిని పరిశీలించి, తుపాను సమయంలో ఎన్ని అడుగుల మేరకు నీరు వచ్చిందని హెచ్ఎంను ఆరా తీశారు. సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. దొంగపిండి వద్ద బొండాడ డ్రెయిన్‌లో గంట సేపు పంటుపై ప్రయాణించి కృష్ణ జిల్లా లక్ష్మీపురం వద్ద ఉప్పుటేరులో బొండాడ డ్రెయిన్ కలిసే ప్రాంతానికి చేరుకొని అక్కడ స్లూయిస్ పరిస్థితిని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం నాగిడి పాలెంలో బొండాడ డ్రెయిన్ నుండి గ్రామంలోకి నీరు వచ్చిన ప్రాంతాన్ని, మందచేడు లాక్స్‌ను పరిశీలించారు. లాక్స్ వద్ద అవసరమైన మరమ్మతులను వెంటనే చేయాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. వారం రోజుల్లోగా తాగునీటి సమస్యను పరిష్కారానికి ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు వెంటనే చర్యలు చేపట్టాలని, స్వచ్ఛమైన తాగునీరు కూడా అందించకపోతే ఎలా అని ప్రశ్నించారు. కరెంటు వైర్లను కూడా మార్చాలని ఆ గ్రామ ప్రజలు జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకు వచ్చారు. అనంతరం తోకతిప్ప గ్రామంలో ముంపు ప్రాంతాన్ని పరిశీలించారు. జిల్లా కలెక్టర్ వెంట క్షేత్రస్థాయి పరిశీలనలో భీమవరం ఆర్‌డిఒ కె.ప్రవీణ్ కుమార్ రెడ్డి, తహశీల్దార్ రావి రాంబాబు, ఇరిగేషన్ శాఖ కెనాల్స్ ఇఇ యు.రమేష్, డ్రెయిన్స్ ఇఇ రుద్ర నరసింహ అప్పారావు, కెనాల్స్ డిఇ పిఎన్‌వివిఎస్ మూర్తి, ఎఇ జయప్రకాష్, ఎఇ డ్రెయిన్స్ ఎండి ఖాదర్, హౌసింగ్ ఎఇ వి.శశి కుమార్, భీమవరం ఎంపిడిఒ గంగాధర్ రావు, దొంగపిండి సర్పంచి బొడ్డు రేవతి తదితరులు పాల్గొన్నారు.

శిథిలావస్థలో వసతి గృహం


- పెచ్చులూడిన భవనం పైకప్పు
- వర్షం నీరు కారి వంటశాల అధ్వానం
- బెడ్స్ లేక నేలపైనే నిద్ర
- సరైన వసతులు లేని ఎస్‌సి బాలికల వసతి గృహం



శిథిలావస్థకు చేరుకున్న వసతి గృహం

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

స్థానిక టూ టౌన్ యాగర్లపల్లిలో ఉన్న సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహం శిథిలావస్థకు చేరుకుంది. భవనం స్లాబ్ అక్కడక్కడా పెచ్చులూడి ఇనుప ఊసలు బయటకి కనిపిస్తున్నాయి. వంటగది పైకప్పు పాడవ్వడంతో వర్షపు నీరు వంటశాలలో పడుతుంది. దీనివల్ల వంటగది అపరిశుభ్రమైన వాతావరణం ఏర్పడి ఆహారం పాడయ్యే అవకాశం ఉంటుంది. ఈ విషయమై హాస్టల్ వార్డెన్ నూర్ బేబిను ప్రశ్నించగా 1983లో ఈ బాలికల వసతి గృహాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అయితే ఇటీవల నూతన వసతి గృహ నిర్మాణానికి రూ.16 లక్షలు ప్రభుత్వం మంజూరు చేశారని, త్వరలో పనులు ప్రారంభిస్తామని తెలిపారు. ప్రస్తుతం హాస్టల్లో 23 మంది బాలికలు ఉంటున్నారు. ఇంత తక్కువ మంది ఉన్నారేంటని వార్డెన్‌ను ప్రశ్నించగా తాను వచ్చి మూడు నెలల కాలమే అవుతుందని, విద్యార్థులను పెంచడానికి క్యాంపెయిన్ చేపడతామని తెలిపారు. ఈ వసతిగృహంలో నాలుగు గదులు మాత్రమే ఉన్నాయి. బాలికలందరూ పడుకోవడానికి బెడ్స్ లేకపోవడంతో నేలమీదనే పడుకుంటున్నారు. విద్యార్థులందరికీ దుప్పట్లు, రగ్గులు, అందజేశామని, ప్రతీవారం స్థానిక పిహెచ్‌సి వైద్యసిబ్బంది విద్యార్థులకు వైద్యపరీక్షలు నిర్వహిస్తున్నారని వార్డెన్ తెలిపారు. బాలికలకు రక్షణగా రాత్రిపూట మహిళ వాచ్‌మెన్‌ను నియమించినట్లు తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం మెనూ అమలు చేస్తున్నామన్నారు. బాత్రూమ్‌లు శిథిలావస్థకు చేరడంతో వాటి స్థానంలో 10 నూతన బాత్రూమ్‌లు, మరుగుదొడ్లు నిర్మించినట్లు తెలిపారు. హాస్టల్లో డైనింగ్ టేబుల్స్ లేకపోవడంతో బాలికలు నేలమీదే కూర్చొని భోజనం చేస్తున్నారు. వాటర్ ట్యాంక్ పాతది కావడంతో పైకప్పు సగం వరకు శిథిలమై ఉంది. అయితే త్వరలోనే మరమ్మత్తులు చేయిస్తామని వార్డెన్ తెలిపారు. దాతలు ఎవరైనా ముందుకు వస్తే వారి సహకారంతో మరింత అభివృద్ధి చేస్తామని వార్డెన్ బేబి తెలిపారు. అయితే మరిన్ని వివరాలకు ఎఎస్‌డబ్ల్యూఒను ఫోన్లో సంప్రదించగా ఆయన అందుబాటులోకి రాలేదు.



పెచ్చులూడుతున్న భవనం పైకప్పు

ప్రజాశక్తి పరిశీలన

పలుచోట్ల సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

భారతదేశంలో సంస్థానాల విలీనంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ ప్రముఖ పాత్ర పోషించారని తాడేపల్లిగూడెం డిఎస్‌పి ధర్మవరపు విశ్వనాథ్ పేర్కొన్నారు. డిఎస్‌పి ఆధ్వర్యాన సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా శుక్రవారం ఉదయం పోలీస్ ఐ ల్యాండ్ వద్ద రన్ ఫర్ యూనిటీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో తాడేపల్లిగూడెం పట్టణ, రూరల్ సిఐలు బోనం ఆదిప్రసాద్, రవికుమార్, ఎస్ఐలు బాదం శ్రీనివాస్, నాగరాజు, తహశీల్దార్ సునీల్‌కుమార్, సోమరాజు స్వామీ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పాలకొల్లు : భారతరత్న సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతిని పురస్కరించుకుని పాలకొల్లు లజపతిరాయ్ పేటలోని మాంటిసోరిస్ జూనియర్ కళాశాల ప్రాంగణంలో స్థానిక టౌన్ పోలీసులు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రజినీకుమార్, స్కూల్ అండ్ జూనియర్ కళాశాల విద్యార్థులు, ఉపాధ్యాయుల సంయుక్త ఆధ్వర్యాన ఘనంగా ఏక్తా దివాస్ నిర్వహించారు. సమావేశానికి అధ్యక్షత వహించిన సెక్రటరీ, కరస్పాండెంట్ కెవి.కృష్ణవర్మ మాట్లాడారు. కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్ చిలుకూరి కుమార్, ఎఎస్ఐలు శివాజీ, మార్లింగం, టౌన్ పోలీస్ సిబ్బంది, స్కూల్ ప్రిన్సిపల్ కిషోర్, కళాశాల ప్రిన్సిపల్ సాయి షణ్ముఖ్ పాల్గొన్నారు. తదనంతరం పూలపల్లి అంబేద్కర్ విగ్రహం నుంచి పోలీస్ స్టేషన్ వరకు ఏక్తా రన్ నిర్వహించారు.

గణపవరం : సరిపల్లి డిజిటల్ స్కూల్ వద్ద శుక్రవారం జాతీయ ఐక్యతా దినోత్సవం ఘణంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న గణపవరం ఎంఇఒ జి.బాలయ్య మాట్లాడుతూ భారత్‌లోని సంస్థానాల విలీనంకు కృషిచేసిన సర్దార్ వల్లభాయ్ పటేల్ గురించి విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ ఆర్.బేబిశ్రీలక్ష్మి, స్కూల్ కరస్పాండెంట్ గుడాల ప్రసాద్, విద్యార్థులు పాల్గొన్నారు.

నరసాపురం : స్థానిక శ్రీవైఎన్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యాన ఏక్తా దివాస్ సందర్భంగా సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కళాశాల అకాడమిక్, రీసెర్చ్ అడ్వైజర్, గవర్నమెంట్ బాడీ సభ్యులు ఆర్‌వి.సుబ్బారావు మాట్లాడారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ బెజవాడ వెంకటరత్నం, డాక్టర్ కమిలి రంగారావు, హెచ్‌ఆర్‌డి డైరెక్టర్ ప్రొఫెసర్ చినమిల్లి శ్రీనివాస్, ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆఫీసర్స్ చింతా సోమేశ్వరి, యాకోబు, విద్యార్థులు పాల్గొన్నారు.

దేశ సమైఖ్యతకు ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ అందించిన స్ఫూర్తిని అలవరుచుకోవాలని ఆర్‌డిఒ దాసిరాజు సూచించారు. వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా పట్టణ సిఐ బి.యాదగిరి ఆధ్వర్యాన నిర్వహించిన ఏక్తా దివస్ ప్రదర్శనకు హాజరైన ఆర్‌డిఒ మాట్లాడారు. కార్యక్రమంలో పట్టణ ఎస్ఐ సిహెచ్.జయలక్ష్మి, సూర్యకళాశాల, సెక్రటరీ జి.బ్రహ్మాజీ, విద్యార్థులు పాల్గొన్నారు.

తణుకు : ఎస్‌కెఎస్‌డి మహిళా కళాశాల, డిగ్రీ, పిజీ(అటానమస్)లోని ఎన్ఎస్ఎస్, ఎన్‌సిసి ఆధ్వర్యాన సర్ధార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతిని పురస్కరించుకుని శుక్రవారం జాతీయ ఐక్యత ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ చిట్టూరి సత్యఉషారాణి రన్ ఫర్ యూనిటీ(ఐక్యత కోసం పరుగు)ను జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం కళాశాల ప్రిన్సిపల్ కెప్టెన్ యు.లక్ష్మీసుందరీబాయ్ మాట్లాడారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్స్ కెవి.శ్యామలాదేవి, సిహెచ్.రమేష్‌బాబు, ఎన్‌సిసి కేర్‌టేకర్ ఎ.దీప్తి, ఎన్ఎస్ఎస్, ఎన్‌సిసి వాలంటీర్లు పాల్గొన్నారు.

పంట నష్టం కౌలురైతుల పేరుతో నమోదు చేయాలి

ఎపి కౌలురైతు సంఘం డిమాండ్



వరిచేలను పరిశీలిస్తున్న నేతలు

ప్రజాశక్తి - గణపవరం

మొంథా తుపాన్ వల్ల నష్టాన్ని ఎడిట్ ఆప్షన్ ఇచ్చి కౌలురైతుల పేరున నమోదు చేయాలని ఆంధ్రప్రదేశ్ కౌలురైతు సంఘం జిల్లా కార్యదర్శి మామిడి శెట్టి రామాంజనేయులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని రైతు, కౌలురైతు సంఘం ఆధ్వర్యాన కాశిపాడు, చిలకంపాడు, పిప్పర గ్రామాల్లో పర్యటించి పడిపోయిన వరిచేలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంట పాలు పోసుకోనే దశలో ఉండటం వల్ల వర్షాలకి పంట పూర్తిగా పాడైపోయి దెబ్బతిందన్నారు. ప్రభుత్వం పర్సంటేజ్‌తో సంబంధం లేకుండా పంటనష్ట నమోదు చేయాలన్నారు. వాస్తవ సాగుదారులైన కౌలురైతులకు పంట నష్టం అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఎకారానికి ఇరవై అయిదు వేల రుపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మండలంలో పంటనష్టం కౌలుకార్డులు లేకపోయినా ఎడిట్ ఆప్షన్ ఇచ్చి కౌలురైతుల పేరుమీద నమోదు చేయాలని, పంటల బీమా వర్తింప చేయాలని అధికారులకు చెప్పారు. ఈ కార్యక్రమంలో కౌలురైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు పెన్మెత్స నరసింహరాజు, రైతుసంఘం నాయకులు గుత్తుల శ్రీనివాస్, కౌలు రైతులు అర్ల రత్నబాబు, కుక్కల నాగరాజు, నడపల్లి రంగరాజు, మెంటే సూర్యారావు, వీరవల్లి రాంబాబు పాల్గొన్నారు.

అంగన్వాడీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు

పెనుమంట్ర : పెనుమంట్ర సమగ్ర శిశుఅభివృద్ధి సేవా పథకం(ఐసిడిఎస్) కార్యాలయం పరిధిలో పలు అంగన్వాడీ కేంద్రాల్లో అంగన్వాడీ కార్యకర్త, అంగన్వాడీ సహాయకురాళ్ల పోస్టులకు ఆయా గ్రామాల్లో స్థానిక మహిళా అభ్యర్థుల నుండి దరఖాస్తులు కోరుతున్నట్లు ప్రాజెక్ట్ అధికారి అంగర కృష్ణ కుమారి తెలిపారు. దరఖాస్తుపై ఏ అంగన్వాడీ కేంద్రానికి ఏ పోస్టుకు దరఖాస్తు చేయబడుతున్నది స్పష్టంగా రాయాలన్నారు. ఖాళీగా ఉన్న అంగన్వాడీ కేంద్రాలు 0513014 జుత్తిగ - 1(ఓబిసిఏ కేటగిరి ఓపెన్), 0513020 మాముడూరు - 2(ఓబిసిఏ కేటగిరి ఓపెన్), 0513043 మార్టేరు - 4 (ఒసి కులంలో బాగా వెనుకబడిన విభాగం), 0513054 ఓడూరు - 1(ఎస్సి), 0515217 శేషమ్మ చెరువు(బిసి బి)లో ఖాళీలకు అర్హత కలిగిన వారు దరఖాస్తులు ఇవ్వాలన్నారు.

కావలసిన అర్హతలు : స్థానిక వివాహిత మహిళలు మాత్రమే అర్హులు, వయసు 1-7-2025 తేదీ నాటికి 21 సంవత్సరాలు నిండి 35 సంవత్సరాలలోపు ఉండాలి. కనీస విద్యార్హత పదోతరగతి ఉత్తీర్ణులై ఉండాలి, వికలాంగులైతే అతి తక్కువ స్థాయి అంగవైకల్యం కలిగిన వారిని మాత్రమే పరిశీలించబడునన్నారు. అందులో వేరొకరి సహాయం లేకుండా తమ పనులు తాము చేసుకోగలిగి పిల్లల రక్షణ కలిగి ఉండాలన్నారు. దరఖాస్తులను నవంబర్ 5వ తేదీ లోపు స్థానిక ఐసిడిఎస్ కార్యాలయంలో ఇచ్చి అక్నోలెడ్జ్ చేసుకోవాలని ఆమె పేర్కొన్నారు.

ఘనంగా పోలీసు అమరవీరుల దినోత్సవం

నరసాపురం : పోలీసు అమరవీరుల దినోత్సవం సందర్భంగా ఘనంగా నివాళి అర్పించారు. శుక్రవారం అల్లూరి సాంస్కృతిక కేంద్రంలో పోలీసుల ఆధ్వర్యాన రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పట్టణ, గ్రామీణ, పాలకొల్లు సిఐలు బి.యాదగిరి, జి.దుర్గాప్రసాద్, కె.రజనీకుమార్, మొగల్తూరు, నరసాపురం రూరల్ ఎస్ఐలు జి.వాసు, టివి.సురేష్, మరో 33 మంది రక్తదానం చేశారు. ఆయా కార్యక్రమంలో ఎస్ఐ సిహెచ్.జయలక్ష్మి, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

పంచాయతీ సాధారణ సమావేశం

పెనుగొండ : గ్రామపంచాయతీ అభివృద్ధికి అన్ని విధాల సహకరిస్తున్న ఆచంట ఎంఎల్ఎ పితాని సత్యనారాయణకు సర్పంచి సానబోయిన కృతజ్ఞతలు తెలియజేశారు. శుక్రవారం పెనుగొండ గ్రామపంచాయతీ కార్యాలయంలో పంచాయతీ సాధారణ సమావేశం నిర్వహించారు. 21 వివిధ రకాల పనులకు సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. పంచాయతీ కార్యదర్శి, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

సినీ గాయకుడు గోగులమండ రాజు మృతి



రాజు (ఫైల్ ఫొటో)

నరసాపురం : సినీ గాయకుడు గోగులమండ రాజు(42) ఇక లేరు. శుక్రవారం తెల్లవారుజామున హైదరాబాద్‌లో గుండెపోటుతో మృతిచెందారు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. శుక్రవారం రాత్రి ఆయన మృతదేహం స్వగ్రామం చిట్టవరంకు చేరుకుంది. గ్రామస్థులతో పాటు పలువురు ప్రముఖులు ఆయన పార్థివదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. నిరుపేద కుటుంబంలో పుట్టిన రాజు కష్టపడి పీజీ వరకు చదువుకున్నారు. చిన్నతనం నుండి సంగీతంపై మక్కువ ఉన్న రాజు స్కూల్ స్థాయి నుంచి పలు పోటీల్లో పాల్గొని అవార్డులు గెలుచుకున్నారు. కాలేజీ, డిగ్రీలో ఉన్నప్పుడే ఆర్కెస్ట్రా, పాటల పోటీల్లో పాల్గొంటూ సింగర్‌గా గుర్తింపు పొందారు. పాడుతాతీయగా కార్యక్రమంలో పాల్గొని గాయకుడు బాలసుబ్రమణ్యం దృష్టిలో పడ్డారు. తొలిసారిగా వెంకటేష్ నటించిన చిత్రంలో పాట పాడారు. ఆ తరువాత సింహా, నీవెవరో నేను ఎవరో వంటి చిత్రాల్లో పాటలు పాడారు. ఎక్కువగా ఆర్కెస్ట్రా ప్రోగ్రాంలను నిర్వహించేవారు. పది మందికి ఉపాధి కల్పించారు. హైదరాబాద్‌లో స్థిరపడ్డా తరుచూ స్వగ్రామానికి వచ్చి వెళ్తుంటారు. ఈ క్రమంలో గుండెపోటుతో మృతిచెందడం అందరినీ కలచివేసింది. సినీ పరిశ్రమ, చిట్టవరం గ్రామ ప్రజలు ఆయన మృతికి సంతాపం తెలిపారు. ఈ సంఘటనతో ఆయన స్వగ్రామం చిట్టవరంలో విషాదఛాయలు అలుముకున్నాయి. శనివారం ఆయన అంత్యక్రియలు గ్రామంలో జరగనున్నాయి.

కార్మికోద్యమ నేత బాబూరావు మృతి తీరని లోటు

మాజీ ఎంఎల్ఎ దిగుపాటి రాజగోపాల్



నివాళు లర్పిస్తున్న నేతలు

ప్రజాశక్తి - పాలకొల్లు

కార్మికోద్యమ నేత చింతకాయల బాబురావు అకాల మృతి తీరని లోటని మాజీ ఎంఎల్ఎ దిగుపాటి రాజగోపాల్ అన్నారు. బాబూరావు చిత్ర పటానికి శుక్రవారం పూలమాల వేసి సంతాపం తెలిపారు. ఒక సాధారణ కార్మికుడిగా ఉద్యమంలోకి వచ్చి ఉమ్మడి జిల్లా సిఐటియు ప్రధాన కార్యదర్శి గా బాధ్యత నిర్వహించి, ఏలూరు జిల్లా సిపిఎం కార్యదర్శిగా, రాష్ట్ర కమిటీ సభ్యులుగా పనిచేసారన్నారు. తాడేపల్లిగూడెం ఏరియాలో కార్మికుల సమస్యపై ఉద్యమం నిర్వహించడంలో కీలక పాత్ర వహించారన్నారు. సమాజ మార్పు కోసం రాజీలేని పోరాటం చేసారన్నారు. బాబూరావు ఆశయాల కోసం పనిచేయడమే ఆయనకు ఇచ్చే ఘనమైన నివాళులు అన్నారు. కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. సంతాప కార్యక్రమంలో మండల కన్వీనర్ జవ్వాది శ్రీనివాస్, చల్లా సోమేశ్వరరావు, యాకల్ రాము పాల్గొన్నారు.

డాక్టర్ అనిల్‌కుమార్ సేవలు అభినందనీయం

ఉద్యోగ విరమణ సత్కారంలో వైద్య సిబ్బంది

ప్రజాశక్తి - పెనుమంట్ర

రెండు దశాబ్దాలకు మించి గ్రామీణ ప్రజలకు వైద్య ఆరోగ్య శాఖ ద్వారా విలువైన సేవలను డాక్టర్ వుందుర్తి అనిల్ కుమార్ అందించారని పలువురు వక్తలు కొనియాడారు. శుక్రవారం మండలంలోని ఆలమూరు(భట్ల మగటూరు) పిహెచ్‌సిలో వైద్యాధికారిగా పనిచేసి, ఉద్యోగ విరమణ చేసిన డాక్టర్ అనిల్ కుమార్‌కు పిహెచ్‌సి పరిధిలోని వైద్య సిబ్బంది, ప్రజలు, కుటుంబ సభ్యులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపిహెచ్ఒ యు.శివప్రసాద్, డిప్యూటీ హెచ్ఒ పిబి.రామారావు, ఎ.సూరిబాబు, పి.పద్మ కుమారి, ఎం.విజయ్ కుమార్ రాజు తదితరులు పాల్గొన్నారు. తన ఉద్యోగ జీవితంలో సహకరించిన అందరికీ డాక్టర్ అనిల్ కుమార్ కృతజ్ఞతలు తెలిపారు.


గ్రామాభివృద్ధికి కృషి చేయాలి

పలువురు వక్తలు

ప్రజాశక్తి - పెనుమంట్ర

గ్రామ సౌభాగ్యానికి పంచాయతీల్లో అధికారులు, సిబ్బంది కృషిచేయాలని పలువురు వక్తలు కోరారు. శుక్రవారం మండలంలోని నెగ్గిపూడి గ్రామ కార్యదర్శిగా పనిచేసి ఉద్యోగ విరమణ చేసిన గుత్తికొండ వెంకటేశ్వర్లు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. మూడు దశాబ్దాలకు మించి వివిధ పంచాయతీల్లో సేవలు అందించిన వెంకటేశ్వర్లును ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి ఎం.వెంకట లక్ష్మి, ఉప సర్పంచి అల్లం బాలసాయి రెడ్డి, పంచాయతీ సభ్యులు, వివిధ శాఖల అధికారులు, గ్రామస్తులు, కూటమి నాయకులు, మండలంలోని పలువురు గ్రామ కార్యదర్శులు పాల్గొన్నారు. తన ఉద్యోగ కాలంలో సహకరించిన అందరికీ వెంకటేశ్వర్లు కృతజ్ఞతలు తెలిపారు.

గోకరాజు వెంకట రంగరాజుకు సత్కారం



సత్కరిస్తున్న గ్రామ సర్పంచి సూర్యనారాయణమూర్తి

ప్రజాశక్తి - కాళ్ల

సమాజానికి, ప్రజలకు, ఆంధ్రుల వైభవానికి ఆవశ్యకతమైన మాటలను పద్య రూపంలో అందించిన గోకరాజు వెంకట రంగరాజుకి కోలనపల్లి గ్రామ సర్పంచి కొనకంచి సూర్యనారాయణమూర్తి ప్రశంసలు తెలిపారు. జువ్వలపాలెం గ్రామంలో గోకరాజు వెంకట రంగరాజును శుక్రవారం సత్కరించారు. ఈ సందర్భంగా సత్కార గ్రహీత గోకరాజు వెంకట రంగరాజు మాట్లాడుతూ 1971వ సంవత్సరంలో మననం చేసిన పద్యాన్ని సమాజానికి మీడియా ముఖంగా వెల్లడించారు. అనంతరం కోలనపల్లి గ్రామ సర్పంచి కొనకంచి సూర్యనారాయణమూర్తి, చారిత్రక విశ్లేషకులు గోకరాజు వెంకటరంగరాజును సన్మానించారు.

రోడ్డు వేయరూ..!

మోకాళ్ల లోతు బురదతో అవస్థలు

రోడ్డు వేయాలని వేడుకోలు



అధ్వానంగా సమతానగర్ రహదారి

ప్రజాశక్తి - ఆకివీడు

వర్షం వస్తే మోకాళ్ల లోతు నీళ్లు నిలిచిపోయి రాకపోకలకు ఇబ్బందిగా ఉంటుందని సమతానగర్ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అసలే కంకర రోడ్డు, కొంతమేర మట్టి రోడ్డు ఇక గత వారం రోజులుగా కురిసిన వర్షాలకి ఈ రోడ్డు మొత్తం బురదగుంటగా మారింది. మోటార్ సైకిళ్లతిరిగే పరిస్థితి లేదు కదా కనీసం నడిచి వెళ్లే పరిస్థితి కూడా కనిపించడం లేదు. ప్యాంట్లు మోకాళ్ల పైకి పెట్టుకుని బురదలో నడిచి వెళ్లాల్సి వస్తోంది. మహిళలు, చిన్నారుల పరిస్థితైతే వర్ణణాతీతం. సుమారు 2,500 మంది వరకు ఉండే ఈ ప్రాంతం నగర పంచాయతీలకి రెండు వార్డులకు ఓటర్లు ఉన్నారు. ఈ ప్రాంతంలో వందలాది మందికి ప్రభుత్వం పట్టాలిచ్చింది. రోడ్డు మాత్రం వేయలేదు. ప్రతినిత్యం ఇక్కడి నుంచి వందల మంది విద్యార్థులు పాఠశాలలు, కళాశాలలకు వెళతారు, రైతులు తిరుగుతున్నారు. రైస్ మిల్లు, ఐస్ ఫ్యాక్టరీలు రోడ్‌లో ఉన్నాయి. ఇంతమంది ఉన్నా.. ఈ ప్రాంతానికి కనీసం తారు రోడ్డు లేకపోవడంతో అనేక అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తమ ప్రాంతానికి రోడ్డు వేయాలని ప్రాంతవాసులు కోరుతున్నారు.

డిఎస్‌పి డాక్టర్ శ్రీవేదకు అరుదైన గౌరవం

ఆంధ్రప్రదేశ్ పోలీస్ పెరేడ్‌కు ప్రాతినిధ్యం



డిఎస్‌పి డాక్టర్ జి.శ్రీవేద

ప్రజాశక్తి - నరసాపురం

నరసాపురం డిఎస్ పి డాక్టర్ జి.శ్రీవేదకు అరుదైన గౌరవం దక్కింది. శుక్రవారం గుజరాత్‌లోని కేవాడీయా వద్ద నిర్వహించే కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ పోలీస్ బృందం డిఎస్‌పి శ్రీవేద నాయకత్వం వహించారు. సర్ధార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతిని పురస్కరించుకుని ఏకతా దివాస్ పరేడ్ కేంద్రం నిర్వహించింది. దీనికి అన్ని రాష్ట్రాల నుంచి పోలీస్ బృందాలు శిక్షణకు తరలివెళ్లాయి. రాష్ట్రం నుంచి కూడా పోలీస్‌లు, అధికారులు వెళ్లి శిక్షణ పొందుతున్నారు. డిఎస్‌పి శ్రీవేద గత కొద్ది రోజుల నుంచి అక్కడే ఉండి శిక్షణ పొందుతున్నారు. ఆమె అసమాన్య సేవాభావం, క్రమశిక్షణ, నిబద్దత, నాయకత్వపు నైపుణ్యాలను, ప్రతిభను గుర్తించిన ఉన్నతాధికారులు ఆంధ్రప్రదేశ్ పోలీస్ పరేడ్‌కు ప్రాతినిధ్యం బాధ్యతల్ని అప్పగించారు. ఏడాది క్రితమే డిఎస్‌పిగా బాధ్యతలు చేపట్టిన ఆమె స్వల్పకాలంలో ఈ అరుదైన గౌరవాన్ని దక్కించుకోవడంపై పోలీస్ అధికారులు అభినందనలు వ్యక్తం చేశారు.

తుపాను బాధితులకు నిత్యావసరాలు అందజేత

ప్రజాశక్తి - తణుకు

ఇటీవల మొంథా తుపాను కారణంగా ఇబ్బందులు పడిన బాధితులకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని తణుకు ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. శుక్రవారం తణుకు పట్టణంలోని ఇరగవరం కాలనీకు చెందిన 30 మల్లికాసుల కుటుంబాలకు పది కిలోల బియ్యంతోపాటు నిత్యావసరాలను ఎంఎల్ఎ పంపిణీ చేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

యలమంచిలి : తుపాను ప్రభావంతో మండలంలో నష్టపోయిన కనకాయలంక, పెదలంక గ్రామాల్లో 258 మత్స్యకార కుటుంబాలకు 50 కేజీల బియ్యం, నిత్యావసర సరుకులు, 1250 మందికి 25 కేజీల బియ్యం, నిత్యావసర సరుకులను మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు అందజేశారు. సభలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

వీరవాసరం : తుపాను వల్ల నష్టపోయిన రైతులందరికీ ప్రభుత్వం నష్టపరిహారం అందజేస్తుందని భీమవరం ఎంఎల్ఎ పులపర్తి రామాంజనేయులు(అంజిబాబు) అన్నారు. కొణితివాడతో తుపాను బాధితులకు శుక్రవారం నిత్యావసర వస్తువులు అందజేశారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ కొణితివాడ-నవుడూరు ఆర్‌అండ్‌బి రహదారి పనులు రూ.3 కోట్లుతో వారం రోజుల్లో పనులు ప్రారంభిస్తామన్నారు. కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అను నిత్యం పర్యవేక్షిస్తూ, అన్ని శాఖల వారిని సమన్వయం చేసుకుంటూ ముందస్తు చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. అనంతరం అత్యాచారినికి గురైన కొణితివాడ బాలికను కలెక్టర్ పరామర్శించారు. కార్యక్రమంలో సర్పంచి భీశెట్టి లక్ష్మీ, మాజీ ఎంపి తోట సీతారమలక్ష్మీ, ఎంపిపి వీరవల్లి దుర్గాభవాని, జెడ్‌పిటిసి గుండా జయప్రకాష్ నాయుడు, తహశీల్దార్ ఎవి.రామాంజనేయులు, ఎంపిడిఒ వైభవతి, యరకరాజు హరిబాబు, చినబాబు, టిడిపి కూటమి నాయకులు పాల్గొన్నారు.

నరసాపురం: మొంథా తుపాన్ ప్రభావంతో తీవ్రంగా నష్టపోయిన ప్రజలకు ప్రభుత్వం అందిస్తున్న నిత్యావసర సరుకులను పిఎం లంకలో ప్రభుత్వం విప్, ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్, మాజీ మంత్రి కాపు కార్పొరేషన్ ఛైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడు, టిడిపి ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆర్‌డిఒ దాసిరాజు, తహశీల్దార్ ఐవివి.సత్యనారాయణ, రాష్ట్ర మత్స్యకార అభివృద్ధి ఛైర్మన్ కొల్లు పెద్దిరాజు, జిల్లా మత్స్యకార అధ్యక్షులు మైలా వసంతరావు, ఎఎంసి ఛైర్మన్ జక్కం శ్రీమన్నారాయణ, మండల అధ్యక్షులు ఆకన చంద్రశేఖర్, శిరిగినీడి రాజ్యలక్ష్మి, నిప్పులేటి తారకరామారావు, బందెల రవీంద్ర పాల్గొన్నారు.

మొగల్తూరు : తుపాన్ ప్రభావంతో తీవ్రంగా నష్టపోయిన ప్రజలను ప్రభుత్వం ఆదుకుంటుందని విప్ బొమ్మిడి నాయకర్ అన్నారు. మండలంలోని కేపీ పాలెం, పేరుపాలెం, పాతపాడు తదితర గ్రామాల్లో తుపాను ప్రభావంతో ఉపాధి కోల్పోయిన బాధితులకు ప్రభుత్వం సరఫరా చేసిన సరుకులను శుక్రవారం మాజీమంత్రి, కాపు కార్పొరేషన్ ఛైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడు, టిడిపి నరసాపురం నియోజకవర్గం ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజుతో కలిసి పంపిణీ చేశారు. ఆర్‌డిఒ దాసిరాజు, తహశీల్దార్ కె.రాజకిషోర్, కొల్లాటి గోపీకృష్ణ, గుబ్బల నాగరాజు, వలవల నాని, సిరిగినీడి రాజ్యలక్ష్మి, నిప్పులేటి తారకరామారావు ఉన్నారు.

'పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి'



పెనుమంట్ర మండలంలో..

ప్రజాశక్తి - పెనుమంట్ర

మొంథా తుపాన్ కారణంగా కురిసిన భారీ వర్షాలకు, గాలులకు మండలంలోని పొలమూరు గ్రామంలో నష్టపోయిన వరి రైతులను ఆదుకోవాలని స్థానిక వ్యవసాయ సొసైటీ ఛైర్మన్ కండిబోయిన శ్రీనివాస్ కోరారు. శుక్రవారం గ్రామంలోని కూటమి నాయకులు వివేకవర్మ, తోరం వెంకన్నబాబు, విశ్వనాథం, గ్రామ వ్యవసాయాధికారి భద్ర తదితరులు పంట ఒరిగిన, పాడైన ప్రాంతాల్లో పర్యటించి, నష్టం అంచనాకు అధికారులతో సహకరించారు.

గణపవరం : తుపాన్ వల్ల నష్టపోయిన రైతులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని ఉంగుటూరు మాజీ ఎంఎల్ఎ పుప్పాల వాసుబాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని పిప్పర కోమట్లపాలెం, కాశిపాడు గ్రామాల్లో పడిపోయిన వరిచేలను రైతులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా వాసుబాబు మాట్లాడుతూ నియోజకవర్గంలో 5,400 ఎకరాల్లో పంట నష్టం కలిగిందని చెప్పారు. మండలంలో 1900 ఎకరాలు నేలకు ఒరిగినట్లు చెప్పారు. ఈ తరుణంలో ప్రభుత్వం పంట రుణాలు పూర్తిగా మాఫీ చేయాలన్నారు. ఎప్పటిలాగే క్రాఫ్ ఇన్సూరెన్స్ ప్రభుత్వమే చెల్లించాలన్నారు. ప్రభుత్వం ద్వారా వచ్చే ప్రతి లబ్ధి భూ యజమాని కాకుండా కౌలురైతులకు అందేవిధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నియోజకవర్గంలోని వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పంట దెబ్బతిన్న రైతులకు సూచనలు

పెనుమంట్ర : ఇటీవల తుపాను కారణంగా తీవ్రంగా దెబ్బతిన్న వరి పైరును రక్షించుకోవడంలో రైతులకు ఫోన్ ద్వారా జాగ్రత్తలు, సూచనలు అందించే కార్యక్రమం మార్టేరు వ్యవసాయ పరిశోధనా స్థానంలో శుక్రవారం నిర్వహించారు. పశ్చిమగోదావరి, ఏలూరు, తూర్పుగోదావరి, అంబేద్కర్ కోనసీమ, కాకినాడ జిల్లాల్లో విస్తారంగా వరి పంటలు దెబ్బతిన్న నేపథ్యంలో ఏర్పడిన ఈ నష్ట నివారణకు రైతులకు తగిన మార్గదర్శకత్వం అందించాలనే ఉద్దేశ్యంతో ఈ కార్యక్రమం నిర్వహించగా రైతుల నుండి మంచి స్పందన వచ్చినట్లు ఏడిఆర్ డాక్టర్ శ్రీనివాస్ అన్నారు. ఈ కార్యక్రమాన్ని మార్టేరు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం(రార్స్)లో నిర్వహించగా రైతుల నుండి విశేషమైన స్పందన లభించిందన్నారు. రైతులు తమ ప్రాంతాల్లో తుపాను ప్రభావం వల్ల ఎదురైన సమస్యలను ఫోన్ ద్వారా వివరించి, పంట రక్షణకు సంబంధించిన సూచనలు కోరారు. ఏడిఆర్ డాక్టర్ టి.శ్రీనివాస్ ఆధ్వర్యాన వివిధ విభాగాల వ్యవసాయ శాస్త్రవేత్తలు ఈ కార్యక్రమంలో పాల్గొని పంట నిల్వ, నీటి నిర్వహణ, కీటకనిరోధం, విత్తన ఎంపిక, పునరావాస చర్యలపై విస్తృతమైన సలహాలు ఇచ్చారు. రైతుల సమస్యలను శ్రద్ధగా విన్న శాస్త్రవేత్తలు పంటల పునరుద్ధరణకు అవసరమైన తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు.

ఉండి : మండలంలోని చిలుకూరు, మహదేవపట్నం, ఎన్ఆర్‌పి అగ్రహారం తదితర గ్రామాలలో మండల వ్యవసాయ అధికారి నిమ్మల శ్రీనివాస్ అధిక వర్షాల వల్ల నేలకొరిగిన పంటపొలాలను సందర్శించి రైతులకు పలు సూచనలను ఇచ్చారు. పొలంలో నీటిని వెంటనే తీసివేయాలన్నారు. వరి పంట పడిపోయిన చోట్ల నిలబెట్టి కట్టాలని, అలాగే పడిపోయిన పంటపై 50 గ్రాములు కల్లుప్పు లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. నీటిని తొలగించిన తర్వాత ప్రొపికొనజోల్ 200 మిల్లీమీటర్లు లేదా హెక్సాకొనజోల్ 400 మిల్లీలీటర్లు ఎకరానికి 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. ఫలితంగా గింజ రంగు మారకుండా, పొడతెగులు, మాని పండు తెగులు రాకుండా నివారించవచ్చునన్నారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు రాంప్రసాద్, చందు, రైతులు పెదపాటి వెంకటేశ్వరరావు, సోమరాజు, శ్రీనివాసరాజు పాల్గొన్నారు.

ఆకివీడు : ఇటీవల తుపాను తాకిడికి గురైన వరి చేల పరిస్థితిపై అధికారులు ఫీల్డ్ సర్వే జరిపారు. శుక్రవారం సాయంకాలం వ్యవసాయ, రెవెన్యూ శాఖ తహశీల్దార్, ఆర్ఐ, ఇతర సిబ్బంది గుమ్మలూరు తదితర ప్రాంతాలలో పర్యటించారు. మొదటి రోజు 900 ఎకరాలు పరిశీలించి 690 మంది రైతులు నుండి వారి అభిప్రాయాలు సేకరించామని తహశీల్దార్ ఫరూక్ తెలిపారు. మరిన్ని ప్రాంతాలలో పర్యటించవలసి ఉందని, పర్యటన పూర్తయిన అనంతరం నష్టం వివరాలు తెలియజేస్తామని వ్యవసాయాధికారి ప్రియదర్శిని తెలిపారు.

సంరక్షణ సంస్థలు నాణ్యమైన విద్య అందించాలి : కలెక్టర్

ప్రజాశక్తి - భీమవరం

బాలల సంరక్షణ సంస్థలు నాణ్యమైన విద్యను అందించడం ద్వారా స్వశక్తితో జీవించేలా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. బాల్య వివాహాల నిరోధానికి అవగాహనా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. గృహహింస, మహిళలపై లైంగిక వేధింపులకు గురిచేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో స్త్రీ, శిశుసంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మిషన్ వాత్సల్య, మిషన్ శక్తి పథకాల కార్యక్రమాల అమలుపై ఆమె సమీక్షించారు. 12 బాలల సంరక్షణ సంస్థలకు లైసెన్స్ పత్రాలను మంజూరు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. ఈ సంస్థల్లో 654 మంది పిల్లలు ఆశ్రయం పొంది విద్యను అభ్యసిస్తున్నారన్నారు. తల్లిదండ్రులను కోల్పోయిన పిల్లలు వారి సమీప బంధువుల సంరక్షణలో ఉంటారని, అటువంటి వారిని గుర్తించి వారిని సమాజంలో మంచి పౌరులుగా తీర్చిదిద్దేలా చూడాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. గృహహింస, లైంగిక వేధింపులు, బాలల అక్రమ రవాణా వంటి హింసకు గురైన మహిళలకు సమగ్ర సేవలు అందించడానికి మిషన్ శక్తి కార్యక్రమంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం 2015 లో వన్‌స్టాప్ సెంటర్‌ను ప్రారంభించిందన్నారు. ఈ కేంద్రంలో న్యాయవాదులు, కౌన్సిలర్లు, వైద్య నిపుణులు ఉంటారని, వీరు బాధిత మహిళలకు వివిధ రకాల సేవలందిస్తారన్నారు. బాధిత మహిళలకు నైపుణ్య శిక్షణ అందించి జీవనోపాధి కల్పించేందుకు చర్యలు తీసుకుంటారన్నారు. మహిళలు ఆపద సమయంలో 181 హెల్ప్‌లైన్‌కు ఫిర్యాదు చేస్తే తక్షణమే రక్షణ కల్పిస్తామన్నారు. డిఆర్ఒ బి.శివన్నారాయణరెడ్డి, జిల్లా స్త్రీ శిశుసంక్షేమ శాఖాధికారి డి.శ్రీలక్ష్మి, జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ అధికారి ఆర్.రాజేష్, జిల్లా వైద్య శాఖాధికారి జి.గీతాబాయి, జిల్లా కార్మిక శాఖాధికారి ఆకన లక్ష్మి, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖాధికారి ఎన్‌వి.అరుణకుమారి, లీడ్‌బ్యాంక్ మేనేజర్ ఎ.నాగేంద్రప్రసాద్, మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ ఎ.రాంబాబు, చైల్డ్‌కేర్ సంస్థల ప్రతినిధులు, సిబ్బంది పాల్గొన్నారు.

వంతెన నిర్మాణ పనుల జాప్యంపై కలెక్టర్ ఆగ్రహం

ఉండ్రాజవరం కూడలి వద్ద పైవంతెన నిర్మాణ పనుల జాప్యంపై జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం భీమవరం కలెక్టరేట్‌లో కలెక్టర్ నాగరాణి తణుకు మండలం ఉండ్రాజవరం కూడలి వద్ద పైవంతెన నిర్మాణ పనుల జాప్యాన్ని సమీక్షించేందుకు ఎన్‌హెచ్ అధికారి, గుత్తేదారుడు సహాయకుడితో సమావేశమై సమీక్షించారు. వంతెన నిర్మాణంలో జాప్యానికి కారణం ఏంటని నిలదీశారు. ప్రాణాలు పోతున్నా పట్టించుకోరా అని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ పైవంతెన పూర్తి కాకపోవడంతో సర్వీస్ రోడ్డు ప్రమాదాలకు నిలయంగా మారిందని మీకు తెలుసా అని ప్రశ్నించారు. పిలిచినప్పుడు కాంట్రాక్టర్ రాకుండా నువ్వు ఎందుకు వచ్చావని గుత్తేదారుడు సహాయకుడిని నిలదీశారు. ఎన్‌హెచ్ అధికారిగా మీ పర్యవేక్షణ ఇదేనా అని ప్రశ్నించారు. ఎన్‌హెచ్ అధికారి నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని తెలిపారు. సమావేశంలో ఎన్‌హెచ్ పిడి బి.కృష్ణమూర్తి, గుత్తేదారుడు సహాయకుడు పాల్గొన్నారు.

పాందువ్వలో సివిల్ రైట్స్ డే

ఉండి : మండలంలోని పాందువ్వ గ్రామం ఎంపిపి ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం సివిల్ రైట్స్ కార్యక్రమం మండల రెవెన్యూ శాఖ ఇన్‌స్పెక్టర్ రేవు కార్తీక్ ఆధ్వర్యాన నిర్వహించారు. కెవిపిఎస్ మండల కార్యదర్శి మాదాసి గోపి తొలుత అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించి మాట్లాడుతూ చట్టం ముందు అందరూ సమానులేనని వివక్షలు, అంటరానితనం నిర్మూలన, భావ ప్రకటన స్వేచ్ఛ, పౌర రక్షణ, వ్యక్తిగత స్వేచ్ఛ, పాలన హక్కులు, 14 సంవత్సరములలోపు పిల్లలను వెట్టి చాకిరి పనుల్లో నియమించరాదన్నారు. అనంతరం ఉపాధి హామీ పనులు, డ్రెయినేజీ, తాగునీటి సమస్య, విద్యుత్, ఇంటి లోన్ సమస్యలు పరిష్కరించాలని ఆర్ఐ రేవు కార్తీక్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో గౌరీ శంకర్, కెవిపిఎస్ సభ్యులు ఎం.అర్జున్, ఎన్.సుబ్బారావు, మోహన్, బి.రమేష్, దేవదాస్, బుజ్జి, కాసులు పాల్గొన్నారు.

ఛాంబర్స్‌లో ఎన్‌సిసి క్యాడెట్స్ ఎంపికలు

పాలకొల్లు : స్థానిక ఛాంబర్స్ డిగ్రీ, పీజీ కళాశాల ఎన్‌సిసి(7 ఎ) నావెల్ యూనిట్ నరసాపూర్ పిఎం వింగ్ ఆధ్వర్యాన 2025-2026 విద్యా సంవత్సరంనకు నూతన విద్యార్థులను ఎన్‌సిసి క్యాండెట్స్‌గా చేర్చుకొను ఎంపిక ప్రక్రియ శుక్రవారం కళాశాలలో నిర్వహించారు. ఎంపిక ప్రక్రియకు విచ్చేసిన విద్యార్థులకు ముందుగా రాత పరీక్ష తదుపరి దేహదారుఢ్య పరీక్షలు నిర్వహించి మొత్తం 20 మందిని ఎంపిక చేసారని, వీరిలో 11 మంది అమ్మాయిలు, 9 మంది అబ్బాయిలు ఉన్నారని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ డి.వెంకటేశ్వరరావు తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు కళాశాల ఛైర్మన్ కెవి.నరసింహారావు అభినందనలు తెలిపారు. ఈ ఎంపిక ప్రక్రియ లెఫ్టినెంట్ సంజిత్ రౌత్రే ఆధ్వర్యంలో నిర్వహించారు.

వాహనదారులకు కౌన్సెలింగ్

ఆకివీడు : మోటార్ వాహనదారుడు వేగంగా పయనించడం ప్రమాదకరమని, జనాభా మసిలే ప్రాంతాల్లో నిబంధన మేరకే స్పీడ్‌గా వెళ్లాలని ఎస్ఐ హెచ్.నాగరాజు సూచించారు. శుక్రవారం సాయంకాలం స్థానిక మెయిన్ సెంటర్ వద్ద నిబంధనలు పాటించకుండా ప్రయాణించే వాహదారులను మోటార్ సైకిలిస్టులను ఆయన సిబ్బందితో కలిసి ఆపి కౌన్సెలింగ్ ఇచ్చి పంపించారు. ఎస్ఐ, సిబ్బంది పాల్గొన్నారు.

గంజాయి రవాణాదారుల అరెస్టు

ఆచంట : ఆచంట పంచాయతీ పరిధి బాలంవారి పాలెం సమీపంలో ఖాళీ లేఅవుట్ వద్ద జిల్లా ఎస్‌పి అద్నాన్ నయీమ్ అస్మి, పెనుగొండ సిఐ రాయుడు విజయ్‌కుమార్ నేతృత్వంలో ఆచంట ఎస్ఐ కె.వెంకటరమణ, నరసాపురం సబ్ డివిజన్ స్పెషల్ పోలీస్ సిబ్బంది సహాయంతో మధ్యవర్తుల సమక్షంలో గంజాయి అక్రమ రవాణాదారులను అరెస్టు చేశారు. ఆచంట, పెనుగొండ మండలాలకు చెందిన కోట భాను సందీప్, గెద్దాడ సుభాష్, వేములూరి ప్రభాస్, చెల్లం పృధ్వీరాజ్, నక్క బాలకృష్ణ, దేవతల కృష్ణబాబు, వెలగన వాసులను చాకచక్యంగా పట్టుకుని వారి వద్ద నుండి మూడు కేజీల 195 గ్రాముల గంజాయితోపాటు మూడు సెల్‌ఫోన్లు, ఒక మోటార్ సైకిల్‌ని స్వాధీన పరుచుకున్నట్లు ఎస్ఐ కె.వెంకటరమణ తెలిపారు. కార్యక్రమంలో కె.గంగరాజు, జి.శ్రీనివాస్, బి.వీరబాబు, ఎం.నాగరాజు, ఎం.వరప్రసాద్, ఎ.రాఘవేంద్రరావులను అభినందించారు.